"ఈ సారి ఆడపిల్ల పుడితే నే నూరు కోను..." హఠాత్తుగా భర్త అన్న మాటలు విని మాన్పడిపోయింది అరుణ.
'నేనూరు కోను... నేనూరు కోను...' ఆ మాటలే ఆమెని వెంటాడుతున్నాయి? వూరు కోక ఏం చేస్తారు???

"ఆడపిల్ల పుడితే తనని అత్తగారింటి నుండి తన్ని తగలేస్తారు కాబోలు?"



# తప్పెవరిది?

పి. రాధా చలపతి

అప్పటి కిప్పటికి ఎంత మార్పు! ఎంత అభివృద్ధి? కావలసినపుడు బిడ్డను కనటం, ఒకరు ఇద్దరు తప్ప మరొద్దనుకోవటం? కడుపులో ఉన్నది ఆడో, మగో తెలుసు కొంటున్నారు - ఆ నలుసుకి ఏ లోపం లేకుండా చూసుకుంటున్నారు? ఆహా... ఎంత మారిపోయాయి రోజులు ప్చ్!!

ఆమె ఆలోచనలలా సాగుతుండగానే భర్త వచ్చిన అలికిడి... 'అల్లుడు వచ్చాడు... వడ్డించు...'' అంటూ కేక వేయటంతో రుక్మిణమ్మ ఈ లోకంలోకి వచ్చింది - వడ్డనకి సిద్ధపడగానే

''నాకు భోజనం వద్దు... ఓ గంటలో బయలుదేరి వెళ్ళాలి. రేపు మీ అమ్మాయిని డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి అబార్షన్ చేయించి, ఓ నెల పోయాక, వచ్చి దిగబెట్టిండి...'' అని చెప్పి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు మళ్లీ బయటికి - మళ్లీ అరగంటలో వచ్చి సూట్‌కేసు తీసుకుని వెళ్లిపోయాడు. అరుణతో చెప్పలేదు. రేపు ఆస్పత్రికి వెళ్లండి!'' అని మరోసారి హెచ్చరించి మరీ వెళ్లాడు.

* * *

లేడీ డాక్టరు రుక్మిణమ్మ చెప్పినదంతా విని ''ఇప్పుడా అబార్షన్ చేయించేది... ఐదవ నెల వచ్చాక కష్టమవుతుంది. తల్లి ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈసారి ఒక్కసారి ఊరుకోండి... తర్వాత...''

''మా అల్లుడు ఊరుకోడు పిల్లని వదిలేస్తానని అంటున్నాడు...''

''అంతటి మూర్ఖుడా? ఒక్క పిల్లకే... ఛీ ఛీ!... అమ్మాయిని వదిలేస్తానన్నాడా? ఈసారి ఆడపిల్ల పుడితే నేను పెంచుకుంటాను... ఏమంటారు?'

'మా అల్లుడు అమ్మాయిని బ్రతకనివ్వడు... ఎలాగైనానరే...''

''చేస్తే మీ అమ్మాయి ప్రాణానికే ముప్పు రావచ్చు... అందుకే నా మాట విని తొమ్మిదో నెల పురుడు పోసి ఆ బిడ్డని నేను తీసుకుంటాను... కావాలని అనుకుంటే ఎవరైనా దత్తతకి మగపిల్లాడిని తీసుకోవచ్చు''.

'మా అల్లుడిగారి సంగతి మీకు తెలియదు - అతను చెప్పినట్లు చేయకపోతే అమ్మాయిని కాపురానికి తీసుకెళ్లరు. అబారన్ చేసెయ్యండి. దాని అదృష్టం ఎలా ఉందో?...''

''అయితే మరో డాక్టరు దగ్గరికి వెళ్లటం మంచిది'' అంటూ వెళ్లిపోయింది డాక్టరు రమాదేవి.

''ఆమెకి పిల్లలు లేరా పాపని పెంచుకుంటానని అన్నది...'' ఇంటికి రాగానే తల్లినడిగింది అరుణ.

''అవునమ్మా! ఆమెకి పిల్లలు లేరు... ఆస్పత్రిలో వదిలేసిన పిల్లలిద్దర్నీ తానే తల్లై పెంచుతోంది... ఆమె అందరిలాంటి డాక్టర్ కాదు... ఎంతో ఓర్పు, నేర్పు ఉన్న డాక్టర్... హస్తవాసి మంచిది! డబ్బు కోసం కాక ఎవరు వచ్చినా సమానంగా వైద్యం చేస్తుంది - తల్లికి ప్రమాదం ఉన్నప్పుడే తప్ప అబార్షన్ చేయటానికిష్టపడదు. అక్కయ్యా లిద్దరికి తనే పురుడుపోసింది. మనం ఇచ్చినంత పుచ్చుకుంటుంది తప్ప ఇంత ఇవ్వాలని ఎప్పుడూ అడగలేదు - నీ పురుటికి ఆమె విదేశాల్లో ఉంది''.

తల్లి చెప్తున్న మాటలు ఆశ్చర్యంగా వింటోంది.

''ఈ రోజుల్లో అలాంటి డాక్టర్లెక్కడున్నారమ్మా? డబ్బు ఇస్తేనే వైద్యం చేస్తున్నారు. మా ఆడపడుచుని నర్సింగ్ హోమ్‌కి తీసుకెళితే నార్మల్ డెలివరీ అవవలసింది -



''నిన్న ఇన్‌స్పెక్టరుతో వచ్చిన కుక్క ఏ జాతిది అంటారూ? చూడ్డానికి చాలా బావుంది కదూ!? భర్తను ప్రశ్నించింది భార్యామణి. ''అది పోలీసు కుక్క'' చెప్పాడు భర్త. ''పోలీసు కుక్కా! అలా కనిపించలేదే''. ఓ''యూనిఫారమ్‌లో లేదులే'' పరధ్యానంగా బదులిచ్చాడు భర్త.

ఆపరేషన్ చేసి ఐదారు వేలు బిల్లు వేసింది - అక్కడికి ఎవరు వెళ్లినా అంతే! అందరికీ మేజర్ ఆపరేషన్ చేయటం, డబ్బు సంపాదించటమే. అదో వ్యాపారంగా నడుస్తోంది. నర్సింగ్ హోమ్‌లో - నగరాలలో అలాంటి నర్సింగ్ హోమ్‌లు కోకొల్లలు డబ్బు ముందు ఇస్తేనే పురుళ్లు పోసే డాక్టర్లు ఉన్నారు...''

''ప్చ్! మొన్న మన ఊళ్లోనే ఓ డాక్టరు దగ్గరికి పల్లెటూరు నుండి ఓ పేదరాలు నొప్పులు పడుతూ వచ్చిందట - వెయ్యి రూపాయలు అక్కడ పెడితే అప్పుడు చూస్తానన్నాడు... డబ్బులిచ్చే వరకు ప్రసవం ఆగుతుందా?... ప్రసవం కాగానే తెస్తానని భర్త కాళ్లా వేళ్లా పడితే కూడా కనికరించక బయటికి పంపిస్తే పాపం! ఆ పేదరాలు రోడ్డు మీదే ప్రసవించిందట దారేపోయేవాళ్లు వచ్చి సహాయపడి, ఆ తర్వాత ఆ డాక్టర్ మీద పోలీసు రిపోర్టు ఇచ్చారట! పేపర్లో వచ్చిందీ వార్త!'' అన్నది రుక్మిణమ్మ.

''పేపర్లో కన్నా రోజూ ఎన్నో జరుగుతూనే ఉంటాయి. ప్రభుత్వాసుపత్రిలో మాత్రం... డబ్బు ఇవ్వలేని వారి ముఖం చూడరు... మంచాలు లేక వరండాల్లోనే ఉంచేస్తారు... వాళ్ళు పడే యాతనలు చూడలేం... ప్రసవం కాక ప్రాణం పోతున్నా పట్టించుకోని డాక్టర్లు చాలా మంది ఉంటారు... నిజంగా రమాదేవిగారి లాంటి డాక్టర్లు ఎక్కడా లేరు. నూటికి ఒకరున్నా ఈ దేశం బాగుపడుతుంది... అడిగిన డబ్బు ఇస్తే అబార్షన్ ఎవరైనా చేస్తారు... కాస్త మంచి డాక్టరు దగ్గరకి వెళ్ళాలి. నాన్నగారొచ్చాక మీరిద్దరు వెళ్ళండమ్మా! నా దగ్గర కొంత డబ్బు ఉంది... మీరు ఇబ్బంది పడకండి!''

''అవేం మాటలే తల్లీ! నీ ఆరోగ్యం గురించే బాధపడుతున్నాం కాని ఖర్చు గురించి కాదు... మంచి కుటుంబమని అన్నీ చూసే చేశాం! నీ అదృష్టం ఇలా ఉంది. పురుటికన్నా 'గర్భ విచ్ఛిత్తి' ప్రమాదకరమైంది! కోలుకోవటానికి చాలా రోజులు పడుతుంది. అసలే అర్భకురాలివి. అదే ఆలోచన...'' అంటూ తల్లి వంట ప్రయత్నంలో పడింది.

అరుణకి మాత్రం మనస్సులో మరో కంగారుగా ఉంది! అబార్షన్ సక్రమంగా జరుగుతుందో లేదో? లేకపోతే తన పరిస్థితి? ''ఆలోచించలేకపోయింది. మంచంమీద పడుకున్నా ఆలోచనలతో బుర్ర వేడెక్కుతోంది తప్ప నిద్ర పట్టడంలేదు... లేచి బయటికి వచ్చింది... ఉయ్యాల్లో పడుకోబెట్టిన పాప లేచి, ఉయ్యాల అంచు పట్టుకుని దిగటానికి ప్రయత్నిస్తోంది... ఒక్క క్షణం గుండె ఆగినంత పనయ్యింది. అరుణకి... ఒక్క అంగలో వెళ్ళి పిల్లని ఎత్తుకుంది. క్షణం ఆలస్యమైతే క్రింద పడిపోయేదే... అమ్మో... కంగారులో పాప కెవ్వుమంది తల్లితోపాటు.

తల్లి రుక్మిణమ్మ ఒక్క అంగలో వంటింట్లోంచి బయటికి వచ్చింది...

''ఒక్క క్షణం ఆలస్యమైతే పడిపోయేదే...''

''చెక్క ఉయ్యాల అంతే! ఒక ప్రక్కకి ఒరుగుతుందనే గబగబా వచ్చాను.''

''పాపకి ఏమైనా అయితే తను తట్టుకోగల్గేదా?... అసలే బాధలో ఉంది?''

''పాపని ఎత్తుకుని పదే పదే ముద్దు పెట్టుకుంది. ఈ ఉయ్యాల్లో వద్దు గుడ్డ ఉయ్యాల్లోనే పడుకోబెట్టు... దానికేమైనా అయితే నేను భరించలేను...'' అరుణ నిస్సత్తువుగా సోఫాలో కూర్చుండిపోయింది.

''ఒకడే బిడ్డ ఉంటే తల్లికీ కంగారు తప్పదు... పట్టిదానివి కాదు అన్నిటికి నీకు మరీ కంగారెక్కువ. కాసేపు అలా మంచం మీద పడుకో... హార్లిక్స్ కలిపి తెస్తాను.''

''వద్దు కాస్త మంచినీళ్ళు తెచ్చిపెట్టు...''

కూతురు పడుతున్న మనోవేదన అర్థం చేసుకున్నది తల్లి... కాని ఏమి చేస్తుంది... అబార్షన్ చేయించకపోతే కూతురి సంసారం విచ్ఛిన్నమైపోతుంది!''

మంచినీళ్ళు తాగాక... దగ్గరే కూర్చుంది రుక్మిణమ్మ.

''డాక్టరమ్మ చెప్పినట్లుగా బిడ్డను కనేవరకు ఊరుకుని...

''వద్దు, వద్దు... ఆయన నన్నొదిలేస్తారు... అప్పుడు నీకు భారమైపోతాను...''

''చెట్టుకి కాయ భారం కాదే తల్లీ! కాని... లోకులు కాకులై బాధిస్తారు... అదే నా బాధ... నీ అత్తా, అల్లుళ్ళ. మూర్ఖత్వానికి బాధ పడుతున్నా... బిడ్డ పుట్టాక అతని మనస్సు మారుతుందన్న ఆశకూడా లేదు... ఇద్దరు ఆడపిల్లలే భారం అయిపోయారు... నల్గురాడపిల్లలు పుట్టినా మీ నాన్నగారు ఎప్పుడూ నొచ్చుకోలేదు... మగ పిల్లాడికోసం ఎదురుచూశాం గాని బిడ్డలు వద్దనుకోలేదు - ఆఖరికి ఐదుగురు పుట్టారు.''

''నాన్న దేవుడమ్మా... మీ చల్లని నీడలో మాకు సంస్కారం అబ్బింది... ఆయన మాటని ఎదిరించలేక పోతున్నా... నా కిష్టంలేకపోయినా అబార్షన్ చేయించుకుంటాను...'' ఒక నిశ్చయానికొచ్చింది ఆఖరుకి.

*** *** ***

ఆ మర్నాడే మరో లేడీ డాక్టరు వద్ద అబార్షన్ చేయించుకుంది - అరుణ... అబార్షన్‌లో బయటపడిన నిజం అందర్నీ నిశ్చేష్టులని చేసింది.. ఆ వార్త విని అరుణ మరి కొన్ని రోజులవరకు మంచానికంటుకుపోయింది... ఆవిడ బాధకి అంతూ పంతూ లేకుండాపోయింది... కుమిలి కుమిలి ఏడుస్తూనే ఉన్నది... స్కానింగ్‌లో తప్పుడు రిపోర్టు రావటం అంతా తన దురదృష్టం... దురదృష్టం కాకపోతే? తన గర్భంలో ప్రాణం పోసుకుంటున్న 'మగ' నలుసుని చంపుకుంటుందా?...

''నేను 'హంతకి'ని'' అంటూ జుట్టు పీక్కుంటోంది పాపం! అరుణ!!!